ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 21 జనవరి 2024



చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
8లో..

శ్రీరాముడి దర్శనానికి మూడు ప్రత్యేక రైళ్లు
- ఈనెలాఖరు నుంచి ప్రారంభం
7లో..

# దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి

**- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందే వివిధ సేవలపై అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, శ్యాం ప్రసాద్‌లాల్‌తో కలిసి తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములు, వాటి ప్రస్తుత స్థితిగతులపై సమగ్ర నివేదిక తయారుచేసి సమర్పించాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. ప్రతివారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను వారం రోజులలోగా పరిష్కరించాలని, సంబంధిత దరఖాస్తుకు పరిష్కారం చూపలేని పక్షంలో ఆ కారణాలను తెలియజేస్తూ వారికి లేఖ రాయాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. సీఎంవో కార్యాలయం నుంచి వచ్చే దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రజలు ఒకే దరఖాస్తుపై పలుమార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా చూడాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులు సకాలంలో పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మీసేవల ద్వారా ప్రజలకు నిర్దేశిత సమయంలో సర్వీసులందే విధంగా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్టిలో ఉంచుకొని ఓటర్ నమోదు కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే సంబంధిత అధికారులకు కేటాయించాలని, క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి ఎప్పటికప్పుడు ఓటరు నమోదు దరఖాస్తులను పరిష్కరించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు తదితర ప్రతిపాదనలు మార్పులు ఏమైనా ఉంటే సమర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్‌లు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, కలెక్టరేట్ కార్యాలయ సి సెక్షన్ పర్యవేక్షకులు ప్రకాష్, డీటీ ప్రవీణ్, రెవెన్యూ అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మహిళా సాధికారతకు మద్దతివ్వాలి..

ప్రతి మహిళ సాధికారత సాధించే అంశంలో ప్రతి ఒక్కరూ మద్దతు అందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో ఈనెల 24వ నిర్వహించనున్న జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు,వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం మహిళా సాధికారత,బాలికా దినోత్సవం, బేటి బచావో బేటి పడావో పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్, జిల్లా సంక్షేమఅధికారి రవూఫ్‌ఖాన్, డీఆర్‌డీవో శ్రీధర్, డీపీవో చంద్రమౌళి, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, తహసీల్దార్లు, ఇతర జిల్లా అధికారులు, డీహెచ్‌ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ దయా అరుణ, జెండర్ స్పెషలిస్టు సుచరిత, సీహెచ్ స్వప్న, ఫైనాన్స్ లిటరసీ స్పెషలిస్టు సంధ్యారాణి, అకౌంటెంట్ ఎం సమత తదితరులు పాల్గొని సంతకాలు చేశారు.

### వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేయాలి

పెద్దపల్లి కల్చరల్, జనవరి 20 : పదో తరగతి పరీక్షల్లో మన జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేయాలని, విద్యార్థులు తప్పకుండా పరీక్షల్లో పాస్ అయ్యే విధంగా చూడాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదోతరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై అదనపుకలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షలు రాసే ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడమే మన లక్ష్యం అని, ప్రభుత్వ పాఠశాలల్లో ఎంత మంది విద్యార్థులకు 10 జీపీఏ వచ్చినప్పటికీ, ఒక విద్యార్థి కూడా ఫెయిల్ కాకుండా ఉండటమే కీలకమన్నారు. 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ ద్వారా ఉదయం పదవ తరగతి విద్యార్థులకు వేకప్ కాల్ చేస్తున్నామని, పంచాయతీ కార్యదర్శులు సైతం గ్రామాలలో పదవ తరగతి చదివే విద్యార్థుల ఇంటికి ఉదయం పారిశుధ్య తనిఖీల సమయంలో వెళ్లి పరిశీలించాలని, వారి తల్లిదండ్రులతో పిల్లల చదువుపై మాట్లాడి ప్రోత్సహించాలని కోరారు. పాఠశాలలకు విద్యార్థులు తప్పనిసరిగా రెగ్యులర్‌గా రావాలని, అధికంగా తరగతులకు గైర్హాజరయ్యే విద్యార్థుల ఇంటికి ఉపాధ్యాయులు వెళ్తున్నారని, ఆ సమయంలో పంచాయతీకార్యదర్శులు, అధికారులు తమ పరిధిలో ఫాలో అప్ చేసి విద్యా శాఖ అధికారులకు సహకరించాలని అన్నారు. ప్రతిరోజు పాఠశాలల్లో అదనపు తరగతులు నిర్వహిస్తున్నామని వీటికి విద్యార్థులు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. పాఠశాలల్లో చదివే విద్యార్థులను మూడు కేటగిరీలుగా విభజించామని, క్యాటగిరి ఏలో చురుకైన విద్యార్థులు, కేటగిరీ బీలో సగటు విద్యార్థులు, కేటగిరీ సీలో వెనుకబడిన విద్యార్థులు ఉన్నారని, కేటగిరీ సీ విద్యార్థులందరు తప్పనిసరిగా పాస్ అయ్యే విధంగా ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల అధికారులు కృషి చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్‌లు, పంచాయతీ కార్యదర్శిలు, మండల పంచాయతీ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సంతకం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

## వైద్య విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

**- జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు**




జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

కళ్యాణ్‌నగర్, జనవరి 20: వైద్య విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు అన్నారు. శనివారం సింగరేణి మెడికల్ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చాలని, చెడు అలవాట్లకు బానిసకావద్దని సూచించారు. వైద్య విద్య అంటేనే ఒత్తిడితో కూడుకున్నదని, ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా చదువును పూర్తిచేయాలని, క్రమశిక్షణతో విద్యార్థులు చదివితే ఏదైనా సాధించవచ్చునని ఆయన అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు మాట్లాడుతూ ర్యాగింగ్‌ను నిరోధించడానికి ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసినట్టు, విద్యార్థులు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, క్షణికావేశానికి లోనై ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పవద్దని సూచించారు. విద్యార్థుల కోసం యోగాతో పాటు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్టు చెప్పారు. అనంతరం న్యాయమూర్తి శ్రీనివాసరావును ప్రిన్సిపాల్ హిమబిందు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో మైనింగ్‌లో అపార అవకాశాలు

**- సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి**



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

రామగిరి, జనవరి 20: అంతర్జాతీయ స్థాయిలో మైనింగ్‌లో ఉజ్వల భవిష్యత్, అపార అవకాశాలు ఉన్నాయని సింగరేణి డైరెక్టర్(పిపి) వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మంథని జేఎన్టీయూ కళాశాలలో నిర్వహించిన కోల్‌మైనింగ్ భవిష్యత్తు అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం కళాశాలకు చెందిన మైనింగ్ డిపార్టమెంట్ విద్యార్థులు, మైనింగ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన సింగరేణి స్టూడెంట్ చాప్టర్ అనే అంశంపై ఆయన ప్రసంగించారు. దేశ ఆర్థిక వ్యవస్థ మైనింగ్ పైనే ఆధారపడి ఉందన్నారు. దేశం ఆర్థికంగా, సామాజికంగా బలపడాలంటే మైనింగ్ వ్యవస్థ కీలకమన్నారు. త్వరలోనే సింగరేణి మైనింగ్ విద్యార్థులకు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తుందన్నారు. అందులో బాలికలకు సైతం అవకాశం కల్పిస్తామన్నారు. జేఎన్టీయూ కళాశాలకు సింగరేణి పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎంఈఏఐ వివరాలను సెక్రెటరీ జనరల్ ఎం.నర్సయ్య వెల్లడించారు. కోల్‌మైనింగ్ భవిష్యత్‌పై స్పాడోస్ ఇన్‌ఫ్రా అండ్‌మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో సైర్యక్‌జోసఫ్, డాక్టర్ లింగంపల్లి సాయివినయ్, డాక్టర్ కుమార్ దోరేటిలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-3,2 జీఎంలు సుధాకర్ రావు, ఎల్‌వీ సూర్యనారాయణ, వివిధ విభాగల అధిపతులు డాక్టర్ మూర్తి, మైనింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకుల కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మంథని, జనవరి 20: మంథని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అస్మా జబీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 6లోపు మంథని మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపిసి కోర్సులలో ప్రవేశాల కొరకు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి ఫీజు లేకుండానే ఫిబ్రవరి 6 లోపు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో పాస్‌పోర్టు సైజ్‌ఫోటో, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం లేదా స్టడీ సర్టిఫికెట్, కుటుంబ ఆదాయ సర్టిఫికెట్, కులం సర్టిఫికెట్(అవసరమైనచో), సెల్ నంబరు, నివాస ధ్రువీకరణ సర్టిఫికెట్ జత చేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబరు 8096286629, 9154365025లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

## ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా యాసర్ల రాజ్‌కుమార్



కోల్‌సిటీటౌన్, జనవరి20: టీఎస్-ఎంఆర్‌పీఎస్ జిల్లా నూతన అధ్యక్షుడిగా గోదావరిఖనికి చెందిన యాసర్ల రాజ్‌కుమార్ (తిమోతి) నియమితులయ్యారు. ఈమేరకు శనివారం గోదావరిఖనిలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడిగా యాసర్ల రాజ్‌కుమార్‌ను రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. జిల్లాలో సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తిమోతి పేర్కొన్నారు.

## గోదావరిఖనిలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, జనవరి 20: ఎస్సీ వర్గీకరణపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ కమిటీ వేయడాన్ని హర్షిస్తూ శనివారం గోదావరిఖని చౌరస్తాలో నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు వడ్డేపల్లి రాంచందర్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణపై ప్రధాని మోదీ ఇచ్చిన హామిని నిలబెట్టుకున్నారని, ఈనెల 23న కమిటీ సమావేశం కానున్నదని, మాదిగ సామాజికవర్గాల, షెడ్యూల్డ్ కులాల ప్రయోజనాలు కాపాడేందుకు మోదీ కృషి చేస్తున్నారన్నారు. ప్రధాని ఎన్నికల హామీలతో పాటు పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మామిడి రాకేష్, మాతంగి రేణుక, సుల్వ లక్ష్మీనర్సయ్య, మామిడి సంపత్, అడ్లూరి రాజేష్, లక్ష్మణ్, పంగ రవి, మల్లయ్య, శివకుమార్, రాజేష్, శంకర్ పాల్గొన్నారు.

## గ్రూప్స్ శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 20 : ఉచిత గ్రూప్ శిక్షణకు దరఖాస్తు గడువు ఈనెల 24 వరకు పొడిగించినట్లు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు డాక్టర్ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్-1,2,3,4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణనిస్తున్నామని, ఆసక్తిగల అభ్యర్థులు www.bcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్ 0878-2268686లో సంప్రదించాలని కోరారు.

## ఎన్‌పీడీసీఎల్ డీఈని కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు



నూతన డీఈ ఈశ్వర్ ప్రసాద్‌కు మొక్కను అందజేస్తున్న నాయకులు

కళ్యాణ్‌నగర్, జనవరి 20: ఎన్‌పీడీసీఎల్ మంథని డివిజన్ డీఈగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఈశ్వర్ ప్రసాద్‌ను శనివారం ఆయన కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ ఈ-27 జిల్లా అధ్యక్షుడు సీటీ రాజు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీటీ రాజు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. డీఈని కలిసిన వారిలో మంథని డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాయిని ఓదెలు, అధ్యక్షుడు వీరాచారి, సభ్యులు రాజేందర్, నరేష్, మౌనిక, శ్రీధర్, కొమురమ్మ, గోలి సత్యం తదితరులు ఉన్నారు.

# రామగుండం మెడికల్ కళాశాలలో ఫ్యాకల్టీల కొరత

**- పూర్తిస్థాయిలో భర్తీకాని పోస్టులు - ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు**




రామగుండం మెడికల్ కళాశాల

కళ్యాణ్‌నగర్, జనవరి 20: గత ప్రభుత్వం సింగరేణి నిధులు రూ.510 కోట్లతో రామగుండంలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలో ఫ్యాకల్టీల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాల రెండవ సంవత్సరం తరగతులు ప్రారంభమైనప్పటికీ సరైన ఫ్యాకల్టీలు లేకపోవడంతో విద్యార్థులు ఇంటర్నల్ పరీక్షలు సరిగా రాయలేకపోతున్నారు. రామగుండం మెడికల్ కళాశాలలో 45ప్రొఫెసర్ పోస్టులకు 12మంది, 45 అసోసియేట్ ప్రొఫెసర్లకు ముగ్గురు, 142 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 44, ల్యాబ్ టెక్నీషియన్లు 55పోస్టులకు ఒకరు, ఫార్మాసిస్టు 12పోస్టులకు ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వీరిపైన అధిక భారం పడుతోంది. మొదటి సంవత్సరం పూర్తయి నవంబరు మాసంలో రెండో సంవత్సరం అడ్మిషన్లు కూడా పూర్తయ్యాయి. అయినప్పటికీ పూర్తిస్థాయిలో ఫ్యాకల్టీ నియామకం జరగడం లేదు. దీనిపై డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ కూడా చొరవ చూపడం లేదనే విమర్శలున్నాయి. అన్ని హంగులతో కళాశాల నిర్మాణం పూర్తయినా చాలా మంది విధులకు హాజరు కావడం లేదు. మొదటి సంవత్సరంలో 150 సీట్లకు 150మంది విద్యార్థులు, ఇందులో 21మంది నేషనల్ కోటా కింద కళాశాలలో చేరారు. విద్యార్థులకు సబ్జెక్టులు బోధించేందుకు అధ్యాపకులు లేకపోవడంతో ఇంటర్నల్ పరీక్షల్లో అనుకున్నంత మేరకు ఉత్తీర్ణత సాధించలేదు. మొదటి సంవత్సరం ఫలితాలు వారంలోపల వెల్లడయ్యే అవకాశాలున్నాయి. ఒకవేళ విద్యార్థులు ఫెయిల్ అయితే మరో ఆరు నెలలు బ్యాక్‌లాగ్‌కు వెళ్లాల్సి ఉంటుంది.

### ఇంటర్నల్ పరీక్షల్లో జీరో శాతం ఉత్తీర్ణత

కాలేజీలో ఆరు నెలలకోసారి నిర్వహించే ఇంటర్నల్ పరీక్షల్లో 150మందికి అందరూ ఫెయిల్ అయ్యారు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ సబ్జెక్టుల్లో విద్యార్థులకు ఆశించిన మార్కులు రాలేదు. రెండు ఇంటర్నల్ పరీక్షల్లో విద్యార్థులు జీరో శాతం ఉత్తీర్ణత సాధించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

### ఆసక్తి చూపని అధ్యాపకులు

కొంతమంది అధ్యాపకులు రామగుండం మెడికల్ కళాశాలకు రావడానికి ఆసక్తి చూపడం లేదు. వచ్చిన వారు కూడా వారంలో ఒకటి, రెండు రోజులు మాత్రమే తరగతులకు హాజరవుతున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ ఒక్కరే ఉండడం, విద్యార్థులకు ల్యాబ్ నిర్వహించేటప్పుడు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. లైబ్రేరియన్‌తో పాటు ఇతర డిపార్ట్‌మెంట్లలో కూడా చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఇప్పటికైనా రామగుండం మెడికల్ కళాశాలలో పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

# రామగుండం కార్పొరేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

**- నీటి పారుదల శాఖ మంత్రిని కోరిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్**



ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జనవరి 20: రామగుండం కార్పొరేషన్ అభివృద్ధికి స్పెషల్ ఫండ్ కింద రూ.100కోట్లు, డీఎంఎఫ్‌టీ కింద రూ.200కోట్లు కేటాయించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డిని కోరారు. శనివారం ఆయన కార్యాలయంలో కలిసి నియోజకవర్గ అభివృద్ధితో పాటు ఎల్లంపల్లి ఎత్తిపోతల ప్రాజెక్టుపై చర్చించారు. ఈ సందర్భంగా మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ ఎల్లంపల్లి ఎత్తిపోతల ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసి చివరి ఆయకట్టుతో పాటు పాలకుర్తి, అంతర్గాం మండలాల్లోని గ్రామాలకు తాగునీటిని అందించాలని కోరారు. గత ప్రభుత్వం వైఫలం వల్ల ఎత్తిపోతల పథకం పనులు ఆగిపోయాయని, ఇప్పటికైనా చొరవ చూపి త్వరగా పూర్తిచేయాలని, రామగుండం నియోజకవర్గంలో అభివృద్ధి వెనుకబడిపోయిందన్నారు. అదే విధంగా పాలకుర్తి, అంతర్గాంలోని ప్రభుత్వభవనాలకు ప్రత్యేక నిధులను కేటాయించాలని మంత్రిని కోరారు. డీఎంఎఫ్‌టీ ఫండ్ కింద రూ.200కోట్లు, స్పెషల్‌ఫండ్ కింద రూ.100కోట్లు రామగుండం కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని, అమృత్ 2.౦ కింద ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. పంచాయతీరాజ్ తరుపున 40 కోట్ల నిధులను కేటాయించాలని, నూతన పరిశ్రమలను ఏర్పా టు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి రామగుండంలో పరిశ్రమలు వచ్చేలా కంపెనీలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

### ఖని బస్టాండ్‌ను ఆధునీకీకరించాలని వినతి

ఉత్తర తెలంగాణలోనే అత్యధిక ఆదాయాన్ని తీసుకువచ్చే గోదావరిఖని బస్టాండ్‌ను ఆధునీకరించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. శనివారం రవాణా శాఖ మంత్రిని ఆయన కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై మంత్రికి విన్నవించారు. 30ఏళ్ల క్రితం కట్టిన గోదావరిఖని బస్టాండ్‌ను విస్తరించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, తెలంగాణలోనే గోదావరిఖని డిపో ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చుతుందని, అదే విధంగా బస్టాండ్‌లో ఆర్‌టీసీ ఆధ్వర్యంలో పెట్రోల్‌బంక్ ఏర్పాటు చేయాలని, దీని ద్వారా టీఎస్ ఆర్‌టీసీకి ఆదాయం సమకూరుతుందన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో నిరుపేదలు, బడుగు, బలహీనవర్గాలకు చెందిన పిల్లలు చాలా మంది ఉన్నారని, వారి కోసం మహాత్మా జ్యోతిరావు పూలే విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, రూ.35కోట్లతో విద్యాలయం ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని, పేదలకు న్యాయం జరుగుతుందన్నారు.

## మధ్యాహ్న భోజన వర్కర్ల సమ్మె నోటీస్

కాల్వశ్రీరాంపూర్, జనవరి 20: సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టినట్లు మధ్యాహ్న భోజన వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు జక్కుల రాజేశ్వరి తెలిపారు. ఎంఈవో కార్యాలయంలో శనివారం సమ్మె నోటీసు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యా హ్న భోజనం నిర్వహిస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు రావడం లేద ని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షురాలు జక్కుల రాజేశ్వరి, పోచమ్మ, అనసూర్య, లక్ష్మీ, పద్మ, ఐలక్క, రాధ, మల్లేశ్వరి, లలిత, విజయ, రాధ, లక్ష్మి, సరస్వతి, నీలక్క, సుగుణ పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటు..

**- మంథని ఆర్డీవో హనుమ నాయక్**



గుండారంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో హనుమనాయక్

కమాన్‌పూర్,జనవరి 20 : దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటేనని మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి వీ హనుమనాయక్ అన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుండారం గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకున్నారని తెలిపారు. మరణించిన వారి ఓట్లను తొలగించేందుకు ఫారం-7, సవరణ ఉంటే ఫారం-8లను సిద్ధం చేయాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. అలాగే ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఆదివారం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈయన వెంట తహసీల్దార్ వంగల మోహన్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## కాపర్ వైర్ చోరీ

మెట్‌పల్లి రూరల్, జనవరి, 20: సత్తక్కపల్లి గ్రామ శివారులోని వరుద కాలువ వెంట ఉన్న వ్యవసాయం పొలాల్లోని మోటర్ల నుంచి కాపర్ వైర్ చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. శనివారం గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ పొలాలకు నీరు పెట్టడానికి రైతులు వెళ్లగా మోటర్ల నుంచి కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.



## మొగి పురుగును నివారించాలి

శంకరపట్నం, జనవరి 20: వరి పంటకు మొగి పురుగు ఆశించకుండా రైతులు నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి రాచకొండ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తగట్టు గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట పీలక దశలో ఉందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో ముగిపురుగు లక్షణాలు కనిపిస్తున్నాయన్నారు. మొగి పురుగు ఆశించకుండా కార్టప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎనిమిది కిలోలు ఒక ఎకరానికి వేసుకోవాలని చెప్పారు. చిరు పొట్ట దశలో వరిలో లిం గాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకొని పురుగుల ఉధృతిని గమనించాలని సూచించారు.

**చిగురుమామిడి:** రైతులు అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాదికారి కేతిరి రంజిత్ రెడ్డి ఆన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని వరి పంటను ఆయన పరిశీలించారు. కాండం తొలుచుపరుగ నివారణకు రైతులకు సూచనలు చేశారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా రైతులు అధికారలను సంప్రదించాలని కోరారు.

## రాష్ట్రస్థాయి విజ్ఞాన మేళాకు ఎంపిక

చొప్పదండి, జనవరి 20: మండలంలోని రుక్మాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పిరిశెట్టి హర్షవల్లిక రాష్ట్రస్థాయి విజ్ఞాన మేళాకు ఎంపికయింది. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి వర్చువల్ విజ్ఞానశాస్త్ర మేళాలో స్మార్ట్ రోటీ మేక్ యూజింగ్ సోలార్ ఎనర్జీ అనే ఎగ్జిబిట్‌ను హర్షవల్లిక ప్రదర్శించింది. ఈ ఎగ్జిబిట్ జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శనగా ఎంపికయింది. ఈ మేరకు శనివారం పాఠశాల ప్రధానోపాధ్యా యుడు బి రఘుకిశోర్, సైన్స్ ఉపాధ్యా యురాలు గట్టు శ్రీవాణితోపాటు ఉపాధ్యాయ బృందం ఆమెను అభినందించారు.

## వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య


ప్రభాకర్(ఫైల్)

పాలకుర్తి, జనవరి 20: కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పాలకుర్తి మండలం పరిధిలోని ఈసాల తక్కళ్లపల్లిలో శుక్రవారం రాత్రి వొడ్నాల ప్రభాకర్(40) అనే లారీ డ్రైవర్ ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లావణ్య ఈనెల 11న సంక్రాంతి పండుగకు తల్లిగారింటికి దట్నూర్ వెళ్లింది. అప్పటినుంచి ప్రభాకర్ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి 9 గంటలకు తండ్రి వొడ్నాల కిష్టస్వామి, తల్లి కమలతో కలిసి భోజనం చేసి నిద్రపోయారు. శనివారం తెల్లవారుజామున మూత్ర విసర్జన కోసం బయటకు వచ్చి కుమారుడి గదివైపు చూడగా ఉరేసుకొని ఆత్మహత్య కనిపించాడు. ఈ మేరకు బసంత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రభాకర్‌కు ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు బంధువులు పేర్కొన్నారు. మృతుడికి కుమార్తె అక్షిత ఉన్నది.

### కడుపు నొప్పి భరించలేక తాపీ మేస్త్రి..

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 20: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగిరెడ్డిపల్లె గ్రామంలో శనివారం రాత్రి జూల సతీష్(35) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాపీ మేస్త్రీగా పనిచేస్తున్న సతీష్ మద్యానికి అలవాటుపడ్డాడు. నాలుగు నెలలుగా తరచూ కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో కడపునొప్పికి వైద్య పరీక్షలు చేయించుకోగా, మద్యం మానివేయాలని వైద్యులు సతీష్‌కు సూచించారు. చికిత్స తీసుకున్న తర్వాత కూడా మద్యం సేవిస్తూ ఉండేవాడని పోలీసులు తెలిపారు. సతీష్ భార్య సుమలత సంక్రాంతి పండుగకు ఇద్దరు పిల్లలతో సహా పుట్టింటికి వెళ్ళింది. శుక్రవారం రాత్రి తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. శనివారం తెల్లవారు జామున ఇంటి ఆవరణలో షెడ్డుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

### అనారోగ్యంతో వృద్ధుడు..

తిమ్మాపూర్, జనవరి 20: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో ఓ వృద్ధుడు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. అలుగునూర్‌కి చెందిన దండు మల్లయ్య (90) భార్య చాలా రోజుల క్రితం మృతి చెందింది. దీంతో మల్లయ్య తన పెద్ద కూతురి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఇటీవల దండు మల్లయ్య కాలుకు ఇన్ఫెక్షన్ వచ్చింది. దీంతో కరీంనగర్‌లోని ప్రభుత్వ అనుపత్రిలో ఆపరేషన్ చేయించారు. పూర్తి స్థాయిలో నయం కాకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. మృతుడి కూతురి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విధులకు ఆటంకం కల్పించిన వ్యక్తిపై కేసు నమోదు

ఓదెల, జనవరి 20 : మండలంలోని ఇందుర్తికి చెందిన కంకణాల పవన్‌రెడ్డిపై శనివారం కేసు నమోదు చేసినట్లు పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. పొత్కపల్లి విద్యుత్ ఏఈ రాజమల్లు విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆటంకం కల్పించి, దౌర్జన్యం చేశాడని ఏఈ ఫిర్యాదు చేశారని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చికిత్స పొందుతూ దివ్యాంగుడి మృతి

వీర్నపల్లి, జనవరి 20: ఆర్థిక ఇబ్బందులు తాళలేక కుటుంబ పోషణ భారమై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వీర్నపల్లి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన జక్కుల లింబాద్రి(36) అనే దివ్యాంగుడు కూరగాయలు అమ్ముతూ కుటుంబా న్ని పోషిస్తున్నాడు. కుటుంబ పోషణ భారమై ఈనెల 18న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తల్లి ఎల్లవ్వ ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. లింబాద్రికి భార్య సరిత, ముగ్గురు కూతుర్లు రుత్విక(7), నిహారిక(5), సాన్విక(3) ఉన్నారు.

## గ్రూప్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

గణేశ్‌నగర్, జనవరి 20: బీసీ స్టడీసర్కిల్‌లో గ్రూప్స్-1,2,3,4, ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణ దరఖాస్తుల గడువును ఈనెల 24 వరకు పొడిగించినట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్ bcstudycircle.cgg.gov.inలో ఈ నెల 24 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ అర్హత కలిగిన ఉమ్మడి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.5లక్షలకు మించరాదన్నారు. దరఖాస్తుతో పాటు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, లేటెస్ట్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు ఆధార్‌కార్డ్, ఫొటోలను ఆన్లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల ఎంపిక రిజర్వేషన్, డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని అన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్‌నంబర్ 0878-2268686లో, బీసీ స్టడీ సర్కిల్ నూతన భవనం, కరీంనగర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## రేపు ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 20: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14, 17 బాల బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించనున్నారు. కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తామని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పి శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, జిల్లాల క్రీడాకారులు పాల్గొనుటకు అర్హులని తెలిపారు. క్రీడాకారులు ఫొటోతో కూడిన అర్హత ఫారంతో స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్, గత సంవత్సర మార్కుల జాబితాతో హాజరు కావాలని సూచించారు.

## మాజీ మంత్రి ఆవిష్కరించిన శిలాఫలకం తొలగింపు


శిలాఫలకం తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మల్యాల, జనవరి 20: గతేడాది క్రితం అప్పటి రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించిన శిలాఫకాన్ని మల్యాల గ్రామ పంచాయితీ సిబ్బం ది తొలగించడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ.2 కోట్లతో మల్యాల-పెగడపల్లి డబుల్‌రోడ్డు పనులు చేపట్టగా గత ఫిబ్రవరి 25న మల్యాల బ్లాక్ చౌరస్తా వద్ద శిలాఫలకాన్ని అప్పటి మంత్రి ఈశ్వర్ ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. తాజాగా దాన్ని కూల్చివేయడం విమర్శలకు దారి తీసింది.

## అసంపూర్తిగా రోడ్డు పనులు


మానకొండూర్-అన్నారం గ్రామాల మధ్య పూర్తి కాని రోడ్డు

మానకొండూర్, జనవరి 20: మానకొండూర్ నుంచి జమ్మికుంట వరకు చేపట్టిన రోడ్డు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం రూ. 70కోట్లతో డబుల్ రోడ్డు పనులు చేపట్టారు. కాగా మండలంలోని మానకొండూర్-అన్నారం గ్రామాల మధ్య అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జమ్మికుంట నుంచి వీణవంక మండలంలోని మామిడాలపల్లి గ్రామం వరకు రోడ్డు నిర్మాణం పూర్తయింది. మండలంలోని పచ్చునూర్ నుంచి మానకొండూర్ వరకు పనులు నిలిచిపోయాయి. దీంతో పాటు ఆయా గ్రామాలలో డ్రేనేజీల నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదు. మానకొండూర్ నుంచి పచ్చునూర్ వరకు 16కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఈ పరిధిలో 8 కల్వర్టులు, రోడ్డు డ్యాంల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా ఇప్పటికీ పట్టించుకోవడం లేదు. తారురోడ్డు లేని ప్రదేశంలో బస్సులు, లారీలు వెళ్తున్న సమయంలో దుమ్ము లేస్తోంది. దీంతో వెనుక వచ్చే ద్విచక్రవాహనదారులు కళ్లల్లో దుమ్ము పడుతుండ డంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తి చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### శ్రీరాముడి దర్శనానికి

# మూడు ప్రత్యేక రైళ్లు

- సికింద్రాబాద్, కాజీపేట, జాల్నా నుంచి అయోధ్యకు..
- ఈనెలాఖరు నుంచి ప్రారంభం
- త్వరలో రిజర్వేషన్ల ప్రక్రియ
- పెద్దపల్లి, రామగుండం, కరీంనగర్ స్టేషన్లలో హాల్టింగ్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)



అయోధ్యలోని రామాలయంలో ఈనెల 22న బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ అనంతరం రామభక్తులు అయోధ్యను సందర్శించేందుకు వీలుగా దక్షిణ మధ్య రైల్వే నెల రోజుల పాటు మూడు ప్రత్యేక రైళ్లను ఉమ్మడి కరీంనగర్ జిల్లా మీదుగా నడపనున్నది. సికింద్రాబాద్, కాజీపే ట, మహారాష్ట్ర జాల్నా నుంచి రైళ్లను నడపనున్నది. సికింద్రా బాద్, కాజీపేట నుంచి నడిచే రైళ్లు పెద్దపల్లి జంక్షన్, రామగుండం రైల్వే స్టేషన్లలో ఆగనుండగా, జాల్నా నుంచి వచ్చే రైలు కరీంనగర్ స్టేషన్, పెద్దపల్లి జంక్షన్, రామగుండం స్టేషన్లలో ఆగనున్నాయి. ఈనెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు ఒకటి, రెండు రోజుల్లో ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకునే ప్రక్రియ ప్రారంభం కానున్నది. నెలరోజుల పాటు నడవనున్న ఈ ప్రత్యేక రైళ్ల ద్వారా అయోధ్య రామ మందిరానికి వెళ్లి ఆ జగదభి రాముడ్ని దర్శించుకునే అవకాశాన్ని దక్షిణ మధ్య రైల్వే అధికారులు కల్పించారు. ఈ రైళ్లు నెల రోజుల పాటే నడుస్తాయా, ఆ తర్వాత కొనసాగిస్తారా అనే విషయం తెలియదు. మూడు ప్రత్యేక రైళ్లు దాదాపుగా ఒకే సమయంలో ప్రారం భంకానున్నాయి. ఈ ప్రత్యేక రైళ్లను నడిపించడం వల్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు అయోధ్యకు వెళ్లేందుకు సౌకర్యంగా ఉండనున్నది.

**● సికింద్రాబాద్ నుంచి..**

రైలు నంబరు 07221 సికింద్రాబాద్ నుంచి అయోధ్య ధాం జంక్షన్‌కు ఎగువ మార్గంలో ఈనెల 29వ తేదీ నుంచి వచ్చేనెల 29వ తేదీ వరకు నడవనున్నది. జనవరి 29, 31, ఫిబ్రవరి 2, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29 తేదీల్లో సాయంత్రం 4:45 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్‌లో బయలుదేరి కాజీపేట జంక్షన్‌కు 6:20 నిమిషాలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7:38 గంటలకు, రామగుండంకు రాత్రి 8 గంటలకు రానున్నది. మరుసటి రోజంతా ప్రయాణించి ఆ తర్వాత తెల్లవారు జామున 3:30 గంటలకు అయోధ్య జంక్షన్‌కు చేరుకుంటుంది. ఒకటిన్నర రోజు ఈ రైలు నడవనున్నది. ఈ ప్రత్యేక రైలు నంబరు 07222 అయోధ్య ధాం రైల్వే జంక్షన్ నుంచి సికింద్రాబాద్ జంక్షన్‌కు దిగువ మార్గంలో ఫిబ్రవరి 1, 3, 5, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 తేదీల్లో, మార్చి 1, 3 తేదీల్లో ఈ రైళ్లు నడవనున్నాయి. అయోధ్య నుంచి మధ్యాహ్నం 2:20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10:30 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్‌కు చేరుకోనున్నది. అయోధ్య నుంచి వచ్చేటప్పుడు రామగుండంకు సాయంత్రం 6:30 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7 గంటలకు, కాజీపేట జంక్షన్‌కు రాత్రి 8:08 గంటలకు చేరుకోనున్నది. ఈ ప్రత్యేక రైలులో 20 స్లీపర్ కోచ్ బోగీలు, 2 సాధారణ బోగీలు ఉండనున్నాయి.

**● కాజీపేట నుంచి..**

రైలు నంబరు 07223 కాజీపేట జంక్షన్ నుంచి అయోధ్య ధాం రైల్వే జంక్షన్‌కు ఎగువ మార్గంలో ఈనెల 30వ తేదీ నుంచి వచ్చేనెల 28వ తేదీ వరకు ప్రత్యేక రైలు నడవనున్నది. వారంలో మూడు రోజులు మొత్తం 15 ట్రిప్పులు ఈ రైలు నడుస్తుంది. జనవరి 30వ తేదీ ఆరంభమయ్యే ఈ రైలు ఫిబ్రవరి 1, 3, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 తేదీలలో కాజీపేట నుంచి సాయంత్రం 6:20 గంటలకు బయలుదేరనున్నది. పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7:38 గంటలకు, రామగుండంకు రాత్రి 8 గంటలకు రానున్నది. ఒక రోజు ప్రయాణం తర్వాత మరుసటి రోజు తెల్లవారుజామున 3:35 గంటలకు అయోధ్య ధాం జంక్షన్‌కు చేరుకోనున్నది. ఇదే రైలు నంబరు 07224 దిగువ మార్గంలో ఫిబ్రవరి 2, 4, 6, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, మార్చి 2వ తేదీల్లో ఈ ప్రత్యేక రైలు నడవనున్నది. అయోధ్య నుంచి మధ్యాహ్న 2:20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 9 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకోనున్నది. ఈ రైలు వచ్చేటప్పుడు రామగుండంకు సాయంత్రం 6:30 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7 గంటలకు రానున్నది. ఈ ప్రత్యేక రైలులో 20 స్లీపర్ కోచ్ బోగీలు, 2 సాధారణ బోగీలు ఉండనున్నాయి.

**● జాల్నా మీదుగా..**

రైలు నంబరు 07649 మహారాష్ట్రలోని జాల్నా నుంచి అయోధ్య ధాం జంక్షన్‌కు వయా పర్బని, పూర్ణా, నాందేడ్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, బల్లార్షా మీదుగా ఎగువ మార్గంలో నడవనున్నది. ఈ రైలు వచ్చేనెల 4వ తేదీన ఉదయం 9:30 గంటలకు జాల్నా రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి బాసర రైల్వేస్టేషన్‌కు మధ్యాహ్నం 3:15 గంటలకు, నిజామాబాద్ జంక్షన్‌కు సాయంత్రం 4 గంటలకు, కోరుట్లకు 5:18 గంటలకు, లింగంపేట్ జగిత్యాలకు 5:50 గంటలకు, కరీంనగర్ రైల్వే స్టేషన్‌కు 6:45 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7:35 గంటలకు, రామగుండంకు రాత్రి 8 గంటలకు చేరుకోనున్నది. అక్కడి నుంచి ఒక రోజు ప్రయాణం తర్వాత మరుసటి రోజు తెల్లవారుజామున 3:35 గంటలకు అయోధ్య ధాం జంక్షనుకు చేరుకున్నది.

దిగువ మార్గంలో రైలు సంఖ్య 07650 అయోధ్య ధాం జంక్షన్ నుంచి జాల్నాకు ఫిబ్రవరి 6వ తేదీన మధ్యాహ్నం 2:20 గంటలకు బయలుదేరి ఒక రోజు ప్రయాణం తర్వాత ఉదయం 6 గంటలకు జాల్నా రైల్వే స్టేషన్‌కు చేరుకోనున్నది. ఈ రైలు అయోధ్య ధాం నుంచి వచ్చేటప్పుడు రామగుండంకు రాత్రి 7:25 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7:55 గంటలకు, కరీంనగర్ రైల్వేస్టేషన్‌కు 8:35 గంటలకు, లింగంపేట్ జగిత్యాల రైల్వే స్టేషన్‌కు రాత్రి 9:20 గంటలకు, కోరుట్ల రైల్వేస్టేషన్‌కు 9:50 గంటలకు, నిజామాబాద్ జంక్షన్‌కు రాత్రి 11:10 గంటలకు, బాసర రైల్వే స్టేషన్‌కు 11:53 గంటలకు చేరుకోనున్నది. ఉదయం 6 గంటలకు జాల్నా రైల్వేస్టేషన్‌కు చేరుకోనున్నది. ఈ ప్రత్యేక రైలులో 20 స్లీపర్ కోచ్ బోగీలు, 2 సాధారణ బోగీలు ఉండనున్నాయి.

# ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ


నరసింహుడి ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ధర్మపురి, జనవరి 20: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం వరకు క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరి నదిలో స్నానాలు ఆచరించి అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్దలతో పూజించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ వేద మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషే కాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

**● కొనసాగుతున్న వేద పారాయణం, హవనం**

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో సంపూర్ణ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, సంపూర్ణ రుగ్వేద హవనం, సంపూర్ణ సామవేద పారాయణం కార్యక్రమాలు మూడవ రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భాగంగా మూడో రోజు వేదపండితులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమం కార్యక్రమంలో విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

## బుగ్గారం గ్రామ సర్పంచ్ సస్పెన్షన్

బుగ్గారం జనవరి 20: బుగ్గారం గ్రామ సర్పంచ్ సుమలతను సస్పెండ్ చేస్తు జిల్లా పంచాయితీరాజ్ అధికారి దేవరాజు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బుగ్గారం గ్రామానికి చెందిన చుక్క గంగారెడ్డి బుగ్గారం గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని పలు సార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ సూచనల మేరకు విచారణ చేపట్టారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని నిర్ధారణ కావడంతో సర్పంచ్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా పంచాయతీరాజ్ అధికారి దేవరాజు తెలిపారు.

## 'నవోదయ' ప్రవేశ పరీక్ష ప్రశాంతం

చొప్పదండి, జనవరి 20: నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జాతీయస్థాయిలో సీబీఎస్ఈ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 7,105 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 73 శాతం మేరకు 5,226 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. 1,879 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. ఎలాంటి సంఘ టనలు లేకుండా పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఆమె తెలిపారు.

## కొండగట్టులో బారులు తీరిన భక్తులు


క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు

మల్యాల, జనవరి 20: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ఆలయంలో అంజన్న ను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు తీర్చుకున్నారు. దాదాపు ఇరవై వేలకు పైగా భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, బొజ్జపోతన పరిసరాలు నిండిపోయాయి.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గంగాధర, జనవరి 20: గంగాధర మండలం ఇస్లాంపూర్‌లో శుక్రవారం అర్ధరా త్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్(ఏపీ36వై1621)ను పట్టుకున్నట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. గ్రామంలోని వాగు నుంచి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎసై తెలిపారు.

# విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



గుండిలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రతిమ

రామడుగు, జనవరి 20: విద్యార్థు లు చిన్నతనం నుంచే లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని క్రమశిక్షణతో చదవాలని కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రతిమ అన్నారు. మండలంలోని గుండి గ్రామంలో న్యాయవాది గుమ్మడి ప్రశాంత్, అక్షర హైస్కూల్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలంటే తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన మార్గాలను అనుసరించి ముందుకు సాగాలని సూచించారు. సామాజిక మాధ్యమాల కు దూరంగా ఉండాలని చెప్పారు. వాటి వల్ల జీవితంలో విలువైన సమయం వృథా అయిపోతుందని అన్నారు. గృహహింస, వరకట్నం, ఆన్‌లైన్ నేరాలపైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆడపిల్లలు సామాజిక మాధ్య మాల్లో ఫొటోలు, వీడియోలను పెట్టకూడదని, ఏదైనా సమస్యలు వస్తే పోలీసులను వెంటనే సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు సెల్‌ఫోన్ లకు బానిస కాకుండా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన అన్ని పాఠశాలల విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేష్, చొప్పదండి సీఐజి రవిందర్, ఎస్ఐ నేరెళ్ళ రమేష్, అక్షర కరస్పాండెంట్ మునిందర్, సర్పంచ్ మానస ప్రవీణ్, న్యాయవాదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వెలుగుల సంస్థకు బకాయిల చీకట్లు

- సిరిసిల్ల సెస్‌కు రూ.714.57 కోట్లు పెండింగ్
- ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి రావాల్సిన బకాయిలు రూ. 624.92 కోట్లు
- పవర్‌లూం విద్యుత్ సబ్సిడీ బకాయి రూ. 82.22 కోట్లు


సెస్ ప్రధాన కార్యాలయం

సిరిసిల్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సహకార రంగంలో దేశంలోనే అగ్రగామిగా పేరొందిన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగానే తయారైంది. గత ప్రభుత్వ హయాం నుంచి బీఆర్ఎస్ అధికార పార్టీకి చెందిన వారే పాలకవర్గంగా ఉన్నారు. దీంతో సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరాల సంఘం (సెస్)కు రావాల్సిన బకాయిలు, సెస్ చెల్లించాల్సిన బకాయిలపై చర్చ లేకుండానే సాగిపోయింది. కొత్త ప్రభుత్వం రావడంతో విద్యుత్ బకాయిల చర్చ ముందుకు వచ్చింది. సెస్ చెల్లించాల్సిన బకాయిలుపై విద్యుత్ సంస్థలు ఒత్తిడి పెంచడంతో సెస్ అధికారులు, పాలకవర్గం బకాయిల వసూలుపై దృష్టి పెట్టింది. ఇదే క్రమంలో సెస్ పరిధిలో ఉన్న సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లను గురువారం తొలగించారు. అధికారుల హూచీకత్తుతో మళ్లీ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలకు కొత్త ప్రభుత్వంలో మోక్షం లభిస్తుందా? అని వినియోగదారులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

**● 420 సర్వీసులతో..**

జిల్లాలో చీకట్లను పారదోలి వెలుగులు నిపండానికి 1970లో 420 సర్వీసులతో ప్రారంభమైన సహకార విద్యుత్ సరఫరా సంఘంలో ప్రస్తుతం 2 లక్షల 70 వేల 545 మంది సభ్యులు ఉన్నారు. గృహ కనెక్షన్లు 1,67,984, వాణిజ్య కనెక్షన్లు 16,974 కనెక్షన్లు, పరిశ్రమల కనెక్షన్లు 1394, పవర్‌లూం కనెక్షన్లు 5635, వ్యవసాయ కనెక్షన్లు 74,391, గ్రామ పంచాయతీ వాటర్ కనెక్షన్లు, విద్యుత్ దీపాల 3118, దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వం కార్యాలయాల కనెక్షన్లతో విద్యుత్ రంగంలోనే ప్రత్యేకతను సాధించిన సెస్‌కు ప్రభుత్వం, వినియోగదారులు, వివిధ సంస్థలు చెల్లించాల్సిన బకాయిలు గుదిబండగా మారాయి. ప్రస్తుతం సెస్‌కు రూ.714.57 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఇందులో ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి దాదాపు రూ.624.92 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఇందులో సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు 50 శాతం సబ్సిడీ బకాయిలు రూ.47.07 కోట్లు, దీనికి సర్ ఛార్జ్‌గా రూ.36.14 కోట్లుతో కలిసి రూ.83.22 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా వీటికి సంబంధించి నీటిసరఫరా, వీధి దీపాలకు సంబంధించి 31 జూన్ 2020 నాటికి రూ.319.52 కోట్లు బకాయిలు పేరుకు పోయాయి. వ్యవసాయ విద్యుత్ సబ్సిడీకి సంబంధించి గత సంవత్సరం మార్చి 31 వరకు రూ.174.04 కోట్ల బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వం వీటిని పెండింగ్‌లో ఉంచి పల్లె ప్రగతి, ఆర్థిక సంఘం నిధుల నుంచి విద్యుత్ బకాయిలను చెల్లిస్తూ వస్తోంది. ప్రస్తుతం 2020 ఆగస్టు నుంచి 2023 నవంబరు వరకు రూ.16.76 కోట్లు మళ్లీ పేరకుపోయాయి. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయాలు, 1049 ఉండగా వీటికి సంబంధించి రూ.3.64 కోట్లు బకాయిలు రావాల్సి ఉన్నాయి. జిల్లాలో సెస్ వినియోగదారుల నుంచి వివిధ కనెక్షన్లకు సంబంధించి రూ.77.81 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నా వ్యవసాయ దారుల నుంచి సర్వీస్ రుసుము నుంచి రావాల్సిన బకాయిలు రూ.8.42 కోట్లు రావాల్సి ఉంది. గృహాలకు సంబంధించి రూ.28.76 కోట్లు, కమర్షియల్‌కు సంబంధించి రూ. 9.98 కోట్లు, పరిశ్రమలకు సంబంధించి రూ.8.68 కోట్లు, మరమగ్గాల పరిశ్రమ నుంచి రూ.1.54 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. ఎస్ఎస్ఐ యూనిట్లకు సంబంధించి రూ.18.81 కోట్లు బాకీలు ఉన్నాయి. దీంతోపాటు పల్లె, పట్టణ ప్రగతికి సంబంధించి రూ.21 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి, వినియోగదారుల నుంచి రావాల్సిన బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి కొనసాగుతున్న క్రమంలో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనే దానిపై ఆసక్తి నెలకొంది.

## 21 మంది మందుబాబులకు జైలు శిక్ష

.సిరిసిల్ల క్రైం , జనవరి 20 : మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 21 మందికి జైలు శిక్షతోపాటు జరిమానా, మరో 29 మందికి ఒక్కొక్కరికి. రూ.3వేల చొప్పున జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ శనివారం తీర్పు ఇచ్చారు. రెండు నెలల్లో సిరిసిల్ల పట్టణ పరిధిలో పోలీసులు తనిఖీలు నిర్వహించగా 50 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరికి సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రఘుపతి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేపించారు. అనంతరం వారిని శనివారం కోర్టులో ప్రవేశపెట్టగా ఇద్దరికీ మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ 3 వేల జరిమానా, ఏడుగురికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ 3వేల రూపాయల జరిమానా విధించారు. మరో 12 మందికి ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ 3వేల జరిమానా, ఇంకో 29 మందికి ఒక్కొక్కరికి రూ 3వేల చొప్పున జరిమానా విధించినట్లు సిరిసిల్ల టౌన్‌సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడి న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్‌లో వచ్చే ఉద్యోగ, ఉపాధి అవకాశలకు పోలీస్ వెరైఫికేషన్ సమయంలో ఇబ్బందులు కలుగుతాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## కులం పేరుతో దూషించిన ఒకరి రిమాండ్

వేములవాడ రూరల్, జనవరి 20: కులం పేరుతో దూషించి దాడి చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ నాగేంద్రచారి శనివారం తెలిపారు. డీఎస్పీ నాగేంద్రచారి తెలిపిన వివరాల ప్రకారం నూకలమర్రి గ్రామానికి చెందిన ముడారపు చంద్రయ్య పొలంలో అదే గ్రామానికి చెందిన లిక్కిడి దేవయ్య అనే వ్యక్తికి సంబంధించిన పశువులు మేత మేసాయి. పశువులు మేత మేస్తే తన పంటకు నష్టం జరుగుతందని దేవయ్యను అడుగగా కులంపేరుతో తనను దూషించి కర్రతో దాడి చేసాడని ముడారుపు చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు విచారణ జరిపి లిక్కిడి దేవయ్యపై అట్రాసిటీ కేసునమోదు చేశామని చెప్పారు. ఈ మేరకు రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు.

## ఆటో యూనియన్ అధ్యక్షుడిగా రహీం

అంతర్గాం, జనవరి 20: రామగుండం పట్టణంలోని రైల్వే స్టేషన్ ఏరియా ఆటో యూనియన్ అధ్యక్షునిగా ఎండీ రహీం ఎన్నికయ్యాడు. శనివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునిగా ఎన్నికైన రహీంను తోటి ఆటో డ్రైవర్లు, స్థానిక కాంగ్రెస్ నాయకుడు అనుమాస శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు ఎండీ ఫారుఖ్, ఫజల్, బాబా, ఇమ్రాన్ పాల్గొన్నారు.

## 22న సెలవు దినంగా ప్రకటించండి

కళ్యాణ్‌నగర్, జనవరి 20: అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా 22న సెలవుదినం ప్రకటించాలని వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి అయోధ్య రవీందర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులకు, విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని, అదే విధంగా కుటుంబ సమేతంగా ఆలయాలకు వెళ్లి పండుగ జరుపుకోవాలని కోరారు.

## దేశ సమగ్రతను కాపాడాలి

కమాన్‌పూర్, జనవరి 20 : దేశంలో దేశ సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పెద్దపల్లి ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ అన్నారు. శనివారం గుండారం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏబీవీపీ నగర ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. దేశంలో రోజురోజుకు పెరుగుతున్న విదేశీ కుట్రలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఏబీవీపీ నాయకులు అరవింద్, ప్రశాంత్, వినయ్, రాజేష్, తేజ, రాజేష్, అజయ్, యశ్వంత్ తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కాల్వశ్రీరాంపూర్, జనవరి 20: మండలంలోని పెద్దరాత్‌పల్లి గ్రామంలో గోడుగు కొమురయ్య, తాత కొమురయ్యలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఎంపీపీ నూనేటి సంపత్, బీఆర్ఎస్ నాయకులు జిన్న రామచంద్రారెడ్డి, నిదానపురం దేవయ్య, రావిశెట్టి సారయ్య, సతీష్, శ్రీకాంత్ ఉన్నారు.

## రేపు సదరం క్యాంపు

కమాన్‌పూర్,జనవరి 20 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సదరం క్యాంపు జరగనున్నట్లు మండల వైద్యాధికారి, ఎంపీడీవోలు సంయుక్తంగా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వికలాంగులు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## 'ట్రినిటి'లో విద్యార్థుల సంబరాలు



కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లి కల్చరల్, జనవరి 20 : స్థానిక ట్రినిటి ప్రాథమిక పాఠశాలలో అయోధ్య రామ విగ్రహ ప్రతిష్ఠాపన ముందస్తు ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు సీతారాములు, లక్ష్మణుడు, హనుమంతుడు మొదలగు వేషధారణలో అలరించారు. రామాలయ నమూనాను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## శ్రీరాముడి అక్షింతలు పంపిణీ

పెద్దపల్లి రూరల్, జనవరి 20 : మండలంలోని పెద్దబొంకూరు గ్రామంలో శనివారం అయోధ్య రాములోరి అక్షింతలను ప్రతి ఇంటికి పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో రామాలయం ప్రతిష్ఠాపన మహోత్సవం ప్రారంభం ఉన్నందున శనివారం గ్రామంలో రాముని చిత్రపటంతో ఊరేగింపు చేపడుతూ ఇంటింటా అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాస మూర్తి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు మిట్టపల్లి శ్రీనివాస్, సీపెల్లి శ్రీనివాస్, రవి శాస్త్రి, సురేష్, శ్రావణ్, శ్రీకాంత్, లిఖిత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వ పథకాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సుల్తానాబాద్, జనవరి 20: కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకులు జాడి బాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. వైద్య అధికారులు చంద్రశేఖర్, శ్రీజ, ఉదయ సింధుజ తదితరులతో పాటు జిల్లా బీజేపీ నాయకు లు బాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, గజబీంకార్ పవన్, గుడ్ల వెంకటేశ్, ఎనగందుల సతీష్, చిట్టవేని సదయ్య, కొమురయ్య, మనోహర్, ఆశా వర్కర్లు సరస్వతి, శారద,రమాదేవి, స్వప్న, సుగుణ, రమా, వసంత,కోమల, సుజాత, స్వరూప, స్వప్న, రమామరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

# చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించాలి

**- జీపీడీపీ జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



సమావేశానికి హాజరైన అధికారులు, కార్యదర్శులు

పెద్దపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తను ఇళ్ల వద్దనే వేరుచేయాలని, దీనిపై ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశం, జీపీడీపీ శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో నివసించే ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండాలంటే ఆ గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సమర్థవంతంగా ఉండాల్సిన అవసరం ఉందని, జిల్లాలో పారిశుధ్య నిర్వహణపై సంబంధిత అధికారులు, సిబ్బంది మంచి పనితీరు కనబరుస్తున్నారని అన్నారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ అత్యంత ప్రాధాన్యత అంశం అని, ప్రతి గ్రామంలోని వార్డుల వారీగా పారిశుధ్య ప్లాన్ రూపొందించుకోవాలని, మన దగ్గర అందుబాటులో ఉన్న పారిశుధ్య సిబ్బంది, వాహనాల కదలిక మొదలగు అంశాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళిక తయారుచేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామంలో చెత్తను బయట వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి వార్డులో చెత్త సేకరించే ట్రాక్టర్ ఎప్పుడు వస్తుంది అనే అంశంపై ప్రజలకు అవగాహన ఉండే విధంగా చూసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ చెత్త బయట వేయకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామంలో స్వయం ఉపాధి మహిళలు, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధుల ద్వారా తడి, పొడి చెత్త వేర్వేరు చేయడంవల్ల కలిగే లాభాలు ప్రతి ఇంటికి ప్రచారం చేయాలన్నారు. గ్రామంలో ముందస్తుగా ఉత్సాహవంతంగా పనిచేసే వార్డు సభ్యుల వార్డును ఎంపికచేసి ఆదర్శవంతమైన వార్డుగా తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. తడి చెత్తతో ఎరువులు తయారు చేసి గ్రామంలోని రైతులకు తక్కువ ధరకు సరఫరా చేయవచ్చన్నారు. ప్రతి మండలంలో రిసోర్స్ సెంటర్ ఏర్పాటు చేసి పొడి చెత్తను సేకరించి పంచాయతీకి ఆదాయం సమకూర్చవచ్చని కలెక్టర్ అన్నారు. గ్రామాలలో నిర్మించిన డంప్ షెడ్లకు అప్రోచ్ రోడ్డు ఉండాలని, లేనిపక్షంలో ఉపాధి హామీ నిధుల కింద సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీధర్, డీపీఓ చంద్రమౌళి, సీపీఓ రవీందర్, మునిసిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు మండల పంచాయతీ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గణిత ప్రతిభాపాటవ పోటీలు



మంథనిలో విజేతకు బహుమతి అందజేస్తున్న ఎంఈవో లక్ష్మి



సుల్తానాబాద్‌లో ప్రశంసాపత్రం అందజేస్తున్న మ్యాథ్స్ ఫోరం ప్రతినిధులు

మంథని, జనవరి 20: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఈవో ఆదేశాలు, తెలంగాణ గణిత ఫోరం జిల్లా విభాగం సూచనల మేరకు శనివారం మండల స్థాయిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు గణిత ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిల్చిన విద్యార్థులకు మండల విద్యాధికారి దాసరి లక్ష్మి జ్ఞాపికలను, ప్రశంసా పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ హరిప్రసాద్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సురేష్ కుమార్, టీఎంఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చౌడారపు శ్రీనివాస్, శ్రీనివాస్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**సుల్తానాబాద్, జనవరి 20:** మండల స్థాయి గణిత ప్రతిభా పాటవ పోటీలను శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి పదవ తరగతికి చెందిన ముగ్గురు చొప్పున సుల్తానాబాద్ కాంప్లెక్స్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీలలో పాల్గొన్నారు. అంగ్ల, తెలుగు విభాగాలలో నిర్వహించిన పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలతోపాటు బహుమతులు పంపిణీ చేశారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం రత్నాకర్, వివిధ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు, గణిత టీచర్లు, ఉపాధ్యాయులు టీఎంఎఫ్ మండల శాఖ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చొక్కారావు పాల్గొన్నారు.

**కమాన్‌పూర్,జనవరి 20 :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గణిత ప్రతిభ పోటీలు జరిగినట్లు మండల విద్యాధికారి పల్లెపాటి సంపత్‌రావు తెలిపారు. ఈనెల 22వ తేదీన జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి పోటీలు జరగనున్నట్లు గణిత ఫోరం అధ్యక్షులు మల్లేశ్వర్‌రావు, ప్రధానకార్యదర్శి రవీందర్‌లు తెలిపారు. కాంప్లెక్స్ ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు సరళ, టీఎంఎఫ్ జిల్లాకౌన్సిలర్ గంగారం ఉన్నారు.

**పాలకుర్తి,జనవరి 20:** మండలంలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి గణిత ప్రతిభాపాటవ పోటీని బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ గణిత ప్రతిభా పాటవ పోటీకి తెలుగు, ఆంగ్ల మాధ్యమాల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**ఓదెల, జనవరి 20 :** ఓదెల హైస్కూల్‌లో మండలస్థాయి గణిత ప్రతిభాపాటవ పోటీలను నిర్వహించారు. ఇందులో ఇద్దరు ప్రథమ, ఇద్దరు ద్వితీయ, మరో ఇద్దరు తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. విజేతలను సన్మానించి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పద్మ, టీఎంఎఫ్ మండల అధ్యక్షుడు జైపాల్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి అశోక్, ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లు, గణితం ఉపాధ్యాయులు వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కాల్వశ్రీరాంపూర్, జనవరి 20:** జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఆంగ్లమాధ్యమంలో మండల స్థాయి గణితా ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఎంఈవో ఆరెపల్లి రాజయ్య, ప్రధానోపాధ్యాయురాలు ఎస్ సునీత తదితరులు పాల్గొన్నారు.



కాల్వశ్రీరాంపూర్‌లో..



ఓదెలలో..



పాలకుర్తిలో..

## కనీస వేతనాల జీవోలు సవరించాలి

సుల్తానాబాద్, జనవరి 20: కనీస వేతనాలకు సంబంధించిన జీవోలను వెంటనే సవరించి కార్మికులకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ రైస్ మిల్ ఆపరేటర్ల సంఘం సర్వసభ్య సమావేశం శనివారం పెద్దమ్మ గుడి ఆవరణలో జరిగింది. సమావేశంలో పాల్గొన్న ముత్యంరావు మాట్లాడుతు గత పదేళ్ల నుంచి కనీస వేతనాల జీవోలను సవరించకుండా ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని దాంతో రైస్ మిల్లు కార్మికులు వేతనాలు సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని అన్నారు. కార్మికుల ఇబ్బందులను గమనించి కనీస వేతనాల జీవోలను 26 వేలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు కట్టెకోల రాజు, అధ్యక్షులు తాండ్ర అంజయ్య, నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

## అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి

సుల్తానాబాద్, జనవరి 20: అర్హులైన వారందరూ ఓటరు గా నమోదు చేయించుకోవాలని కళాకారలు ఓటు హక్కు గురించి, దాని వినియోగం, ప్రాముఖ్యత గురించి ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ విలీన గ్రామమైన పూసాల గ్రామంలో శనివారం కళాకారలు ప్రదర్శనలు నిర్వహించారు. పెద్దపల్లి సమాచార పౌర సంబంధాల శాఖ వారి ఆధ్వర్యంలో కళాకారులు ఇచ్చిన ఈ ప్రదర్శనలో ఓటు హక్కు గురించి చెప్పడంతో పాటు యువత డ్రగ్స్ ఇతర మాదక ద్రవ్యాలు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా కళాకారుల బృందం తమ ప్రదర్శనలు ఇచ్చింది. ఈ కార్యక్రమంలో కళాకారలు గుండ్ల స్నేహలత, బుర్ర శంకర్ గౌడ్, డిల్లీ వెంకటస్వామి, నారగోని సరిత, స్పందన, స్వప్న, శ్వేత, ఉప్పు స్పందన తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ

ధర్మారం, జనవరి20: ధర్మారం మండలం నందిమేడారం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన వడ్ల మొగిలి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిప్ప మణిశర్మ బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులను అందజేశారు. బాధిత నిరుపేద కుటుంబాన్ని ఆయన పరామర్శించి వారికి బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

## జిల్లా స్థాయి స్కేటింగ్‌లో విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

సుల్తానాబాద్, జనవరి 20: ఎన్టీపీసీలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలలో నిర్వహించిన పోటీలలో సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్‌స్కూల్‌కు చెందిన శివప్రసాద్, సంప్రీత్‌లు పతకాలు సాధించారు. బాలుర విభాగంలో శివప్రసాద్ సిల్వర్ మెడల్, ఎం సంప్రీత్ బ్రాంజ్ మెడల్ సాధించారు. వీరిని కరస్పాండెంట్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అభినందిస్తూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల పట్ల శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

## 27న మండల సర్వసభ్య సమావేశం

ధర్మారం, జనవరి20: ధర్మారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 27న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి. జయశీల ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొనాలని ఆమె కోరారు.

## ఎల్లంపల్లి పైప్‌లైన్ లీకేజీ

రామగిరి, జనవరి 20: రామగిరి మండలం కల్వచర్ల గ్రామ శివారు ప్రాంతంలోని శ్రీపాద ఎల్లంపల్లి 2టీఎంసీ పైప్‌లైన్‌లో ఏర్పడిన డ్యామేజ్ కారణంగా శనివారం సాగు నీరు పంట పొలాల్లోకి చేరింది. గ్రామ శివారులో పగిలిన పైప్‌లైన్ నుంచి భారీగా వచ్చిన వరద పొలాల్లోకి చేరింది. పెద్దఎత్తున వరద నీరు పంట పొలాల్లోకి చేరడంతో ఇసుక మేటలు పెట్టి రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారు. సర్పంచ్ గంటపద్మ వెంకటరమణరెడ్డి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌కు సమాచారం అందించారు. వరద నీటి కారణంగా పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు.

## బాధిత కుటుంబానికి చేయూత

రామగిరి, జనవరి 20: రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాంనగర్‌కు చెందిన జక్కుల ఐలయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి సెంటినరీకాలనీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మోల్మూరి శ్రీనివాస్ సౌజన్యంతో సింగరేణి యువబలగం బియ్యం వితరణతో పాటు సింగరేణి కార్మికుడు ఉయ్యాల కుమారస్వామి, ఉడుత ఓదెలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డైరెక్టర్ గంట వెంకటరమణరెడ్డి, లయన్ శరణ్య, సురేష్, బుడిగే క్రాంతి, మేకల మారుతీ, బాస్కర్, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

## వికలాంగుల వెల్ఫేర్ సొసైటీకి నగదు అందజేత

పాలకుర్తి, జనవరి 20: జీడినగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని యూనివర్సల్ ఐటీ ఫౌండేషన్ పాఠశాల యాజమాన్యం మరోసారి తన దాతృత్వాన్ని చాటుకుంది. శనివారం గోదావరిఖనిలోని మంథని డివిజన్ వికలాంగుల వెల్ఫేర్ సొసైటీ సంస్థకు యూనివర్సల్ పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు 57,000 రూపాయల నగదును అందించారు. గతంలో కరోనా లాక్‌డౌన్ సమయంలో సైతం ఆ సంస్థకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ అనాథలకు, వృద్ధులకు చేయూతను అందించాలన్నారు.

## బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం



కొలనూర్ పాఠశాల ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్థులు

ఓదెల, జనవరి 20: మండలంలోని కొలనూర్ హైస్కూల్లో ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు మోహన్ కరుణశ్రీ లను శనివారం విద్యార్థులు, గ్రామస్తులు, పూర్వపు విద్యార్థులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. హైస్కూల్లో విధులు నిర్వహించి విద్యార్థిని, విద్యార్థులకు ఆదర్శవంతంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు బదిలీ కాగా మన ఊరు, మనబడి వేదిక ఆధ్వర్యంలో బదిలీ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సామ మనెమ్మ, శంకర్, ఎంపీటీసీ కారెంగుల శ్రీనివాస్, ఉపసర్పంచ్ పాకాల సంపత్ రెడ్డి,సింగల్ విండో మాజీ డైరెక్టర్ బైరి రవీందర్ గౌడ్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాటూరి రత్నం, దొడ్డె శంకర్ పాల్గొన్నారు.

●కమాన్‌పూర్, జనవరి 20: మండలంలోని జూలపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న కమలాకర్‌రావు, ఉపాధ్యాయులు ధశరథం, సునీతలను బదిలీపై వెళ్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం గ్రామ ప్రజాప్రతినిధులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లపల్లి శంకర్‌గౌడ్, ఉప సర్పంచ్ పోలు దాసరి సాయికుమార్, ఎంపీటీసీ శేవ్వ శంకరయ్యలు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం వితరణ

అంతర్గాం, జనవరి 20: అంతర్గాం మండలం పరిధిలోని ముర్మూర్ గ్రామానికి చెందిన గొర్రె రవి మెదడు ఆపరేషన్ జరిగి పక్షవాతంతో మంచానికే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో సామాజిక సేవకుడు దేవి లక్ష్మీనర్సయ్య, కాంగ్రెస్ నాయకుడు జూల లింగయ్యలు బాధితుడు రవి పరిస్థితిని మనోజ్‌కుమార్ అగర్వాల్‌కు తెలుపగా 25కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.





## ఆర్జీ-2 పర్సనల్ విభాగం సమీక్షా సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 20: ఆర్జీ-2 ఏరియా పర్సనల్ డీజీఎం రాజేంద్ర ప్రసాద్ ఏరియాలోని పర్సనల్ అధికారులతో సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. ఏరియాలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులు, సీఎంపీఎఫ్, హెచ్ఎల్ఆర్ఎస్, మెడికల్ కార్డులు, క్వార్టర్ల కేటాయింపు, ఉద్యోగుల క్రమశిక్షణ చర్యలు, నామినేషన్ ఫారాలను పూర్తిచేయడం, పదోన్నతులపై చర్చించారు. డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ సమయంలో పేర్లు పంపిపే సమయంలో అన్ని రకాల డాక్యుమెంట్లు పరిశీలించాలని సూచించారు. ఈసమావేశంలో పర్సనల్ మేనేజర్ అనిల్‌కుమార్, డీవైపీఎం వేణుగోపాల్, సీనియర్ పర్సనల్ అధికారి సురేందర్, సంక్షేమాధికారి ఓంకారిబాబు, ఆఫీస్ సూపరెండెంట్లు, జయరాజ్‌తో పాటు అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ల పర్సనల్ విభాగం ఉద్యోగులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎంను కలిసిన కాంట్రాక్టు కార్మికులు



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 20: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు శనివారం ఉపముఖ్యమంత్రిని భట్టి విక్రమార్కను కలిశారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎంకు కాంట్రాక్టు కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కోల్ ఇండియాలో కాంట్రాక్టు కార్మికులకు అమలులో ఉన్న హైపవర్ వేతనాలు లేదా జీవో నంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. దశలవారిగా కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, 2022 సెప్టెంబరులో సమ్మె చేయగా యాజమాన్యం కుదుర్చుకున్న ఒప్పందంలోని అంశాలను అమలు చేయాలని కోరారు. బోనస్ 20శాతం పెంచాలని, వార్షిక లాభాల్లో కాంట్రాక్టు కార్మికులకు వాటా చెల్లించాల ని, నర్సరీ కార్మికులను కాంట్రాక్టు కార్మికులుగా పరిగణించి సీఎంపీఎఫ్ అమలు చేయాలని డిప్యూటీ సీఎంకు విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎంని కలిసిన వారిలో కొరివి రాజ్‌కుమార్, మిర్యాల రంగయ్య, సారయ్య, వీరభద్రయ్య, బుర్ర తిరుపతి, అక్బర్‌అలీ, అఫ్రోజ్‌ఖాన్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

## గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై జీఎం సమీక్ష



గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న జీఎం

రామగిరి, జనవరి 20: సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో నిర్వహించే 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఉత్తమ ఉద్యోగుల ఎంపిక, విద్యార్థుల గౌరవ వందనం, జెండ ఆవిష్కరణ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను చేపట్టాలని అధికారులకు సూచించారు. రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను చేపట్టాల్సిందిగా ఆదేశించారు. ఈ వేడుకకు అధిక సంఖ్యలో సింగరేణి కార్మికులతో పాటుగా పరిసర ప్రాంతాల ప్రజలు హాజరుకావాలని కోరారు.

ఈ సమావేశంలో అధికారులు బైద్య, ఎలీషా, శ్రీనివాసులు, జైనుల్లబద్దీన్, రాజేందర్, పద్మరాజు, చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, రాజారెడ్డి, ఐలయ్య, లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కార్మిక సమస్యలు పరిష్కరిస్తాం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 20: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ అక్రం పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతనెలలో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ ఆరు డివిజన్‌లలో గెలిచి ప్రాతినిధ్య సంఘం హోదా దక్కించుకున్నదన్నారు. రిటైర్డ్ కార్మికులు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల కోసం యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ఉన్నతాధికారులతో చర్చించిన మీదట చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించినట్టు తెలిపారు. రిటైర్డ్ కార్మికులకు రావాల్సిన లాభాల వాటా ఈనెల 19 వారి ఖాతాలకు జమ అయ్యాయని, యాజమాన్యం పీఎల్ఆర్ బోనస్ 21న, ఏరియర్స్ ఫిబ్రవరి 9న చెల్లించనున్నట్లు తెలిపారు. ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి, సెంట్రల్ వైస్‌ప్రెసిడెంట్ అక్బర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

## సమష్టి కృషితో ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

**సింగరేణి డైరెక్టర్(పిపి): వెంకటేశ్వర్‌రెడ్డి**



ఓసీపీ-2ను వ్యూపాయింట్ ద్వార పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

రామగిరి, జనవరి 20: ఉత్పత్తి లక్ష్యాలను సమష్టి కృషితో సాధించాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్టుఅండ్‌ప్లానింగ్) వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. శనివారం సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2ను సందర్శించారు. బొగ్గు ఉత్పత్తితో పాటు ఓబీ వెలికితీతకు కృషిచేయాలన్నారు. ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు చేపడుతున్న చర్యలను జీఎం సుధాకర్‌రావు వివరించారు. అధికారులు రాధాకృష్ణ, రాజేందర్, శ్రీనివాస్, నాగరాజు, ఉదయ్‌హరిజన్, రామారావు పాల్గొన్నారు.